నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
5 | హైదరాబాద్, బుధవారం 10 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి హారతినిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌భేషుశ్ లక్ష్మీనరసింహాచార్యులు

# లక్ష్మీనృసింహ స్వామికి వైభవంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, జనవరి9 : యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామికి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు చేశారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్ర నామార్చన చేసి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం వేళ స్వామి వారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత కనుల పండువగా నిర్వహించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయం చెంతగల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని

స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలిత పారాయణం చేశారు. ఆంజనేయ స్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున పారాయణికులు వేద మంత్రాలు పటిస్తూ అమ్మవార్లకు తిరుప్పావై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. గోదాదేవి శ్రీరంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠిస్తూ అర్చకులు మార్గళి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ. 18,78,702 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

## 20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దవూర, జనవరి 9 : మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20న ఎంట్రన్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని పలు సెంటర్లలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లు/ అడ్మిన్ కార్డులను https/ navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 7794037457కు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

## అందుబాటులో ఆరు తడి విత్తనాలు

• టీఎస్ ఎస్‌డీసీ రీజనల్ మేనేజర్ కృష్ణవేణి

మిర్యాలగూడ రూరల్, జనవరి 9 : యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరు తడి పంటలు సాగు చేసేందుకు శుద్ధి చేసిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని నందిపహాడ్‌లోని తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ సీహెచ్ కృష్ణవేణి అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెసర, మినుము, వేరుశనగ, మంచి శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తనాలు అవసరమున్న రైతులు 9849908757కు ఫోన్ చేయాలని సూచించారు.

# గ్యారెంటీలు మాత్రమే!

## ఇతర దరఖాస్తులు ఆన్‌లైన్ చెయ్యట్లే

### ఆప్షన్ లేకపోవడంతో పక్కన పడేస్తున్న ఆపరేటర్లు

- దరఖాస్తుల డేటా ఎంట్రీలోనూ సర్వర్ సమస్యలు
- ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 11.52 లక్షలు
- ఐదు రోజుల్లో ఆన్‌లైన్ చేసినవి 5.22 లక్షలు
- సీఎం చెప్పినా కొత్తగా వచ్చిన దరఖాస్తుల తిరస్కరణ
- ఈ నెల 17వరకు ఎంట్రీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం

భువనగిరిలో ప్రజాపాలన దరఖాస్తుల డేటాను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

నల్లగొండ, జనవరి 9 : ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతున్నది. ఐదు రోజులుగా డేటా ఎంట్రీ జరుగుతున్నప్పటికీ సర్వర్ సమస్యతో ఆలస్యమవుతున్నది. గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ జరుగగా, ఈ నెల 5 నుంచి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11.52 లక్షల దరఖాస్తులు రాగా ఈ ఐదు రోజుల్లో 5.22 లక్షల దరఖాస్తులు ఆన్‌లైన్ అయ్యాయి. ఇంకా 6.30 లక్షలు ఆన్‌లైన్ చేయాల్సి ఉన్నది. అయితే ఈ నెల 17 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం గ్యారెంటీలకు సంబంధించి మాత్రమే ఆన్‌లైన్ అవుతుండగా మిగిలిన దరఖాస్తులకు సైట్‌లో ఆప్షన్ లేకపోవడంతో వాటిని పక్కన పెడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 మున్సిపాలిటీలు, 71 మండలాల్లోని తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఈ ఆన్‌లైన్ ప్రక్రియ 3,845 మంది ఆపరేటర్లతో నడుస్తున్నది.

### ఐదు పథకాలకే..

ప్రజా పాలన కార్యక్రమంలో ఐదు గ్యారెంటీల కింద మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుకు కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆహార భద్రత కార్డుతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్‌లను జత చేశారు. చాలా మంది ఆశావహులు తమకు రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశంతో తెల్ల కాగితంపై కుటుంబ సభ్యుల వివరాలు రాసి ఇచ్చారు. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డులు కావాలని 74వేల మంది, ఇతర బెన్‌ఫిట్స్ కావాలని మరో 12వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఐదు గ్యారెంటీలు కాక మరో 86,409 మంది ఇతర పథకాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఐదు పథకాలకు మాత్రమే ఆన్‌లైన్ చేసే ఆప్షన్ ఉండడంతో రేషన్ కార్డుతోపాటు ఇతర బెన్‌ఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న 86వేల దరఖాస్తులను పక్కన పెడుతున్నారు. దరఖాస్తులో కుటుంబ సభ్యుల వివరాలు ఎక్కువ ఉంటే డేటా ఎంట్రీ చేసే సమయంలో ఆలస్యమవుతున్నది.

### అధికారుల పర్యవేక్షణలో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తాసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో 3,845 మంది ఆపరేటర్లతో డేటా ఎంట్రీ నడుస్తున్నది. మండల స్థాయిలో తాసీల్దార్, నియోజకవర్గ స్థాయిలో ఆర్డీఓ, ఆర్డీఓ లేని ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు, జిల్లా స్థాయిలో కలెక్టర్, నోడల్ అధికారుల పర్యవేక్షణలో డేటా ఎంట్రీ కొనసాగుతున్నది. ఈ నెల 17వ తేదీలోపు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో పండుగ సెలవులను దృష్టిలో పెట్టుకొని వేగంగా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇదిలా ఉండగా గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అయితే ఈ డేటా ఎంట్రీ జరుగుతున్న సమయంలో ఆయా మండలాలు, మున్సిపల్ కేంద్రాల్లోకి వెళ్లి కొందరు ఆశావహులు దరఖాస్తులు ఇస్తే తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజా పాలన దరఖాస్తులను జాగ్రత్తగా ఎంట్రీ చేయాలి

• కలెక్టర్ హనుమంతు కె.జెండగే

వలిగొండలో ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

అడ్డగూడూరు, జనవరి 9 : ప్రజా పాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సిబ్బందికి సూచించారు. అడ్డగూడూరు మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ ప్రక్రియను ఈ నెల 17లోపు పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ పూర్తి చేసిన దరఖాస్తులను జాగ్రత్తగా భద్రపర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రైమరీ, జడ్పీ పాఠశాలలను, మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ ప్రేమలత, మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు రహీమున్నీసా పాల్గొన్నారు.

### వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

వలిగొండ : ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. మంగళవారం వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ గీతారెడ్డి, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ కేదారీశ్వర్ ఉన్నారు.

ఎన్‌జీ కాలేజీలోని గ్రంథాలయానికి బహూకరించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

# పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

• ఎన్‌జీ కాలేజీ ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్

రామగిరి, జనవరి 9 : పుస్తక పఠనంతో ఎంతో జ్ఞానం పెరుగుతుందని, ఇందుకు నిదర్శనం గ్రంథాలయాలని ఎన్‌జీ కాలేజీ ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ అన్నారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గ్రంథాలయానికి మంగళవారం సుల్తాన్ చాంద్ ట్రస్ట్ న్యూఢిల్లీ వారు 568 పుస్తకాలను బహూకరించారు. భౌతిక, రసాయన, గణితం, వాణిజ్య, ఆర్థిక శాస్త్రం పుస్తకాలను అందజేయగా, వాటి విలువ రూ.2,48,575 ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు ఆనందం దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మునీరొద్దీన్, అధ్యాపకులు శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నక్క నర్సింహ పాల్గొన్నారు.

# పథకాలన్నీ కేసీఆర్ సర్కార్‌వే..

యాదగిరిగుట్ట : బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, పక్కన జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

- 6 గ్యారెంటీల్లో 420 మోసాలే : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత
- గుట్టలో ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

యాదగిరిగుట్ట, జనవరి 9 : సంక్షేమ పథకాలన్నీ కేసీఆర్ సర్కార్‌వేనని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పాటు సీడీపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ వచ్చి తమవేనని చెప్పుకొంటున్నదని, ఆరు గ్యారెంటీల్లో 420 మోసాలేనని ఆరోపించారు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను రెపరెపలాడించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకానికి నిధులు మంజూరు చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు పంపిణీ చేసి గొప్పలకు పోతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలోనే ఆలేరు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. యాదగిరిగుట్టలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి నిధులు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నెల గడుస్తున్నా దానిపై ఊసెత్తడం లేదని విమర్శించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశామని, ఆ పథకం అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు విశ్రమించొద్దని సూచించారు.

### సంపదను సృష్టించి ప్రజలకు పంచిన కేసీఆర్ : జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

సంపదను సృష్టించి ప్రజలకు పంచింది మాజీ సీఎం కేసీఆరేనని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. ప్రజలకు అద్భుత పథకాలను అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. అధికారం కోల్పోయామని దిగులు పడొద్దని.. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల్లో తప్పకుండా బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కేసీఆర్ కాకుండా ఇతరులను ఊహించుకోలేమన్నారు. కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప, ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. అప్పులున్నాయని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. నెలలోనే రూ.14 వేల కోట్ల అప్పు ఎందుకు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. పథకాలు అమలు చేయలేకనే శ్వేత పత్రం అంటూ డ్రామాకు తెర తీస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేదొకటి, చేసేదొకటిగా ఉన్నదన్నారు. రేవంత్‌రెడ్డి నోట అన్నీ అబద్ధాలే వస్తాయని, ఆయనకు సీఎం హోదాలో ఉండే స్థాయి లేదని పేర్కొన్నారు.

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, ఎంపీపీలు చీముల సుధీర్‌రెడ్డి, పైళ్ల ఇందిర, జడ్పీటీలు తోటకూరి అనూరాధ, పల్లా వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కర్రె వెంకటయ్య, వెంకటేశ్‌గౌడ్, గంగుల శ్రీనివాస్ యాదవ్, ఎండీ ఖలీల్, బీసు చందర్‌గౌడ్, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, బాలనర్సయ్య, మల్లేశ్‌గౌడ్, మల్లేశ్, శ్రీకాంత్, రాజేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

### కాలయాపన చేసేందుకే ఆరు గ్యారెంటీలు : మహేందర్‌రెడ్డి

కాలయాపన చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తీసుకొచ్చిందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన పేరిట దరఖాస్తుల స్వీకరణ అంటూ కాలయాపన చేస్తూ వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పబ్బం గడిపేందుకు చూస్తున్నదని ఆరోపించారు. ఒక్క ఓటేస్తే ఇద్దరం పని చేశామని, పదేండ్లలో నీతి నిజాయితీతో ప్రజలకు పాలన అందించామని అన్నారు. లోపాలను సరిచేసుకొని రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని నాయకులకు సూచించారు. పార్లమెంట్ అభ్యర్థి ఎవరైనా గెలిపించేందుకు సన్నద్ధం కావాలని, అధిష్టానం అవకాశం ఇస్తే భువనగిరి నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

యాదగిరిగుట్టలో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

## జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు కొత్తపల్లి విద్యార్థిని

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పరిశాల శ్వేత

హాలియా, జనవరి 9 : అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పరిశాల శ్వేత ఈ నెల 11 నుంచి 14వ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగనున్న 67వ జాతీయ స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ అండర్-19 విభాగంలో బాలికల చాంపియన్ షిప్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. శ్వేత కట్టంగూర్‌లోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్నది. శ్వేత చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో తండ్రి నాగరాజును కోల్పోయింది. తల్లి కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నది. శ్వేతకు ఒక చెల్లె, ఒక తమ్ముడు ఉన్నారు. వీరు వేర్వేరు గురుకుల పాఠశాలల్లో చదువుతున్నారు. శ్వేత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపేది. అది గమనించిన పాఠశాల పీడీ క్రికెట్‌లో ప్రోత్సహించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమె ఎంపిక పట్ల గ్రామ ఎంపీటీసీ వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ ఉడ్తూరి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పంగ లక్ష్మణ్ యాదవ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లా ఓటర్లు 6,45,385

- ముసాయిదా జాబితాను విడుదల చేసిన అధికారులు
- అభ్యంతరాలుంటే ఈ నెల 21 వరకు అవకాశం
- ఓటు నమోదుకు ఈ నెల 20, 21న ప్రత్యేక క్యాంపులు
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా విడుదల

భువనగిరి కలెక్టరేట్, జనవరి 9 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసింది. వీటిని మండల కేంద్రాలు, గ్రామాల్లో అందుబాటులో ఉంచనున్నది. దీని ప్రకారం జిల్లా వ్యాప్తంగా 6,45,385 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,22,055 మంది, స్త్రీలు 3,23,309 మంది, ఇతరులు 21మంది ఉన్నారు. పురుష ఓటర్ల కన్నా స్త్రీలు 1,254మంది అధికంగా ఉన్నారు. జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 21వరకు అవకాశం కల్పించారు. ఇక ఈ నెల 20, 21వ తేదీల్లో ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

### నియోజక వర్గాల వారీగా ఓటర్ల వివరాలు

జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలతోపాటు మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, నకిరేకల్ నియోజకవర్గంలోని రామన్నపేట, తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన ఓటర్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| భువనగిరి | 1,07,618 | 1,09,322 | 1 | 2,16,941 |
| ఆలేరు | 1,16,708 | 1,16,539 | 19 | 2,33,266 |
| చౌటుప్పల్ | 31,362 | 31,506 | 1 | 62,869 |
| నారాయణపురం | 19,390 | 19,151 | 0 | 38,542 |
| రామన్నపేట | 22,342 | 21,841 | 0 | 44,183 |
| మోత్కూరు | 13,445 | 13,508 | 0 | 26,953 |
| అడ్డగూడూరు | 11,190 | 11,441 | 0 | 22,631 |
| మొత్తం | 3,22,055 | 3,23,309 | 21 | 6,45,385 |



### రెండు రోజులు ప్రత్యేక క్యాంపులు

ఈ నెల 20, 21వ తేదీల్లో ఓటు నమోదు కోసం ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు అందుబాటులో ఉండనున్నారు. కొత్తగా పేరు నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రం మార్పు, ఓటరు పేరులో ఏమైనా మార్పులుంటే సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై ఇచ్చిన అభ్యంతరాలు, ఓటరు నమోదు, సవరణల కోసం వచ్చిన దరఖాస్తులను ఫిబ్రవరి 5 వరకు పరిశీలించి ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను అధికారులు విడుదల చేయనున్నారు.

మరిన్ని జిల్లా వార్తలు 8వ పేజీలో